క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: స్వర్ణాంధ్ర–2047 లక్ష్యంగా ప్రతి విద్యార్థి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంఈవో గంగిరెడ్డి కోరారు. స్థానిక సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో కడప మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ, చర్చా వేదిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతి మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా విశ్వనాథ రెడ్డి, రామాంజనేయరెడ్డి, దశరథరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

29న శ్రీదేవి త్రయ శతక మంజరి పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : హిందూ ధర్మ సమాజ ప్రార్థనా దేవాలయాల సంస్థ ఆధ్వర్యంలో బహు శతక గ్రంథకర్త మామిళ్ల వెంకటలోకనాథం రచించిన శ్రీదేవి త్రయ శతక మంజరి పుస్తకావిష్కరణ 29న నిర్వహించనున్నట్లు సంస్థ వైస్ చైర్మెన్ కాల్వ సోమకళానాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, మానవతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి విచ్చేస్తారన్నారు.

మానసిక వైద్యశాలకు నిధులు కేటాయించాలి



విలేకరులతో మాట్లాడుతున్న కుమారస్వామి

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలోని మానసిక వైద్యశాల నిర్వహణకు నిధులు కేటాయించాలని బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పిల్లా కుమారస్వామి, ఉపాధ్యక్షులు శివారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు కోరారు. తమ సొసైటీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ మనో బంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప, చెన్నూరు, మైదుకూరు, వల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో మతి స్థిమితంలేని అనాథలను గుర్తించి రిమ్స్‌లో నూతనంగా నిర్మించిన మానసిక వైద్యశాలలో చేర్పిస్తున్నామన్నారు. అనాథలు ఎక్కడైనా కనిపిస్తే మనో బంధు ఫౌండేషన్ లేదా బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీకి తెలియజేయాలని అన్ని పోలీస్ స్టేషన్లకు ఎస్పీ ఆదేశాలివ్వాలని వారు కోరారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ



స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల పరిసరాలు శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, పి.శివరామకృష్ణ, డా.లీలావర్ధిని, వర్లు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పరీక్షలలో మార్కులు తక్కువగా వచ్చాయని విద్యార్థిని అల్తాఫ్‌ను విచక్షణారహితంగా కొట్టిన లెక్చరర్‌పై కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద శ్రీచైతన్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి అర్థమయ్యేలా బోధన చేయాలి గానీ.. విచక్షణా రహితంగా దాడి చేయడం తగదన్నారు. ఒత్తిళ్లు తాళలేక విద్యార్థులు ఏ అఘాయిత్యానుకో పాల్పడితే తమకేమీ సంబంధం లేదని చేతులు దులుపుకొంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల విచారణ

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నబీకోటకు చెందిన శశిధర్‌రెడ్డి, జిలానీ బాషాల వద్ద 26 వాహనాలను రికవరీ చేసినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. ఇరువురు దాదాపు 38 వాహనాలను రూ.30 వేల అద్దెకు తీసుకున్న నిందితులు ఆ కార్ల యజమానులకు తొలి నెల అద్దె చెల్లిస్తారు. అనంతరం ఆ యజమానులకు మాయమాటలు చెప్పి రికార్డులను సొంతం చేసుకుంటారు. ఒక్కో వాహనాన్ని లక్ష రూపాయల నుంచి నాలుగు లేదా ఐదు లక్షలకు కుదువ పెట్టుకుంటారు. వారి వెనుక ఇంకా ఎవరెవరు వున్నారు? అని సీఐ జి.వెంకటేశ్వర్లు విచారిస్తున్నారు. ఇద్దరిపై చీటింగ్ కేసును నమోదు చేశారు.

పాల కొండల్లో.. నీటి పరవళ్లు

పచ్చదనం నిండుకున్న కొండలపై నుంచి జాలువారుతున్న నీటి పరవళ్లు ఒక వైపు.. జల పాతం నీటిలో తడిసి సేదతీరుతున్న జనం మరో వైపు.. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కడప నగర శివారులోని పాలకొండలపై నిత్యం ఇదే సందడి కనిపిస్తోంది. పొంగి పొర్లుతున్న జలపాతం చూసేందుకు నగర వాసులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. కొండ ఎగువకు చేరుకుని నీటిలో నడుస్తూ మధురానుభూతి పొందుతున్నారు. మరింతమంది తమ కుటుంబ సమేతంగా వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి ఒడిలో ఆహ్లాదంగా గడిపేస్తున్నారు. – కడప వైఎస్ఆర్ సర్కిల్





రాజా థియేటర్‌లో పోలీసుల లాఠీఛార్జ్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 'దేవర' సినిమా రిలీజ్ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున అభిమానులు, థియేటర్ యాజమాన్యం సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. ఇది కాస్త ఉద్రిక్తతకు దారితీయడంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



అండర్-19 తైక్వాండో పోటీల్లో రాణించిన కడప నగర క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : రైల్వే కోడూరులో ఈ నెల 26, 27న నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో జిల్లా స్థాయి ఎంపికల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అండర్–19 తైక్వాండో పోటీల్లో నగరానికి చెందిన సంతోష్, నాగ ధర్మేశ్వరరాజు, సుహారత్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైనట్లు శిక్షకుడు కొన్నిపాటి వెంకటేష్ తెలిపారు. ఈ నెల 26న కడప వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 తైక్వాండో పోటీల్లో పీస్ హైస్కూల్ విద్యార్థి ఎస్.ఇబ్రహీం ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ ఎస్.గౌస్‌పీర్ తెలిపారు. ఆయన అక్టోబర్ 6, 7వ తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

చదరంగం క్రీడకు విద్యార్థుల ఎంపిక



కడప నియోజకవర్గ యోగా జట్టు



చదరంగం జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కడప నియోజకవర్గ స్థాయి చదరంగం, యోగ పోటీలు శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త ఎస్.సాజిత్, వ్యాయామోపాధ్యాయులు జిలానీ బాషా, రామచంద్రయ్య, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, సువర్ణ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ ప్రాంతంలోనే ఎంఎస్ఎంఈ న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్ రెడ్డి కోరారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీభాగ్ ఒప్పంద ప్రకారం రాష్ట్ర మొదటి రాజధాని రాయలసీమలోనే ఉండేదన్నారు. కడపలోని ఎంఎస్ఎంఈని అమరావతికి తరలించుకు పోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో న్యాయ కళాశాల ఏర్పాటుచేయాలని, ఉక్కు పరిశ్రమ పనులు యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించాలని కోరారు. కమ్యూనిస్టు ప్రమాణాలకు అనుకూలంగా లేని పుట్టపర్తి జిల్లా కమిటీని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మక్బూల్ బాషా, సిద్ధిరామయ్య, డాక్టర్ నాగన్న, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి



ప్రార్థనకు హాజరైన విశ్వాసులు



దైవ సందేశం ఇస్తున్న పాస్టర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : లోకాన్ని రక్షించేందుకు జన్మించిన ఏసుక్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అంతర్జాతీయ ప్రసంగీకులు పాస్టర్ జాయ్ వాల్సన్ పిలుపునిచ్చారు. కడప నగర శివారులోని ది పెంతకొస్తు మిషన్ (చర్చి)లో జరుగుతున్న ప్రత్యేక బైబిల్ అధ్యయనాలు, సువార్త స్వస్థత సభల్లో శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఆపదలో ఉన్న వారికి చేసే సాయం నేరుగా ప్రభువుకు చేరుతుందని, అప్పుడే ఆ దేవుని ఆశీర్వాదం లభిస్తుందని వివరించారు. బైబిల్ లోని పలు అంశాలను ఆయన సమగ్రంగా వివరించారు. ప్రజల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు, మత గురువులు, పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

హోంగార్డుల రిజర్వేషన్లు కొనసాగించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : హోంగార్డుల రిజర్వేషన్లను కొనసాగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పోలీస్, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏపీఎస్పీలో 8 నుంచి 15 శాతం, సివిల్‌లో 15 నుంచి 25 శాతానికి గతంలో రిజర్వేషన్లు పెంచడంతో పోలీస్ బోర్డు సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ కేసుపై ఒక్క హియరింగ్‌కు కూడా హాజరవ్వకుండా కాలయాపన చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది హోంగార్డ్స్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయ్యారన్నారు. గతంలో ఉన్న 40 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తే 2400 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చినా.. అంశంపై మాట్లాడలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, నగర కన్వీనర్ విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి, బాలగురయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

కడప ఎడ్యుకేషన్ : కమ్యూనిస్టు యోధుడు సీతారం ఏచూరి మృతి ఉద్యమానికి తీరని లోటు అని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక సీమ కన్వీనర్ ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ ఓబయ్య పేర్కొన్నారు. కడపలోని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశలోనే మార్క్సిస్టు భావజాలంపై ఆకర్షితుడయ్యారన్నారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘ కార్యకలాపాల్లో పాల్గొనడంతోనే ఆయన ఉద్యమ జీవితం మొదలైందన్నారు. భాజపా వ్యతిరేక ప్రతిపక్ష కూటమి నిర్మాణంలో ఆయన చురుకైన పాత్ర నిర్వహించారన్నారు. డి.ఎం.ఓబులేసు యాదవ్, మల్లికార్జున, సందీప్, బబ్లు, రవి తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు
అక్టోబరు 3 వరకు గడువు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : నిరు పేద విద్యార్థులు..చదువు ఆపేయకుండా ఆర్థిక చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏటా జాతీయ స్థాయి ప్రతిభా ఉపకార వేతన పరీక్ష(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) నిర్వహిస్తోంది. ఈ పరీక్షకు ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పున నాలుగేళ్లపాటు రూ.48 వేలు ప్రభుత్వం అందిస్తుంది. అక్టోబరు 3వతేదీ వరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చు. ఇప్పటి వరకు 2240 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఉపాధ్యాయులు అవగాహన కల్పించి నైపుణ్యాలను పెంపొందిస్తే మరింతమంది దరఖాస్తు చేసే అవకాశం ఉంది.

ఈ నెల 26వతేదీ నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలిలా ఉన్నాయి

మేనేజ్‌మెంట్	దరఖాస్తులు పంపిన పాఠశాలలు	అందిన దరఖాస్తులు
జిల్లా పరిషత్తు	145	1644
ఎంపియూపీ	26	132
గవర్నమెంట్	07	100
ఏపిఎంఎస్	03	126
ఎంపిఎల్	12	216
ఎయిడెడ్	06	22

ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం



ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ప్రతి పాఠశాల నుంచి దరఖాస్తు చేయించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. వారు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయిస్తారు. గడువు ఇక ఆరు రోజులే ఉంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్పందించాలి.
– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

నైపుణ్యం కలవారే రాణిస్తారు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

వైవీయూ వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పుత్తా పద్మ

వైవీయూ : చదువుతున్న విద్యకు అనుగుణంగా నైపుణ్యం కలవారే రాణిస్తారని కడప యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పుత్తా పద్మ పేర్కొన్నారు. విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని అన్నమాచార్య సెనేట్ హాల్‌లో 'ఉన్నత విద్య ప్రయోజనాలు, వ్యూహాలు సవాళ్లు, నైపుణ్యం–ఆధారిత పాఠ్యాంశాలు' అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ముఖ్య అతిథి ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ చదువు, నేర్చుకుంటున్న పనిలో నైపుణ్యం ఏరోజు కారోజు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము మాట్లాడుతూ విద్యకు అందుకనుగుణంగా ప్రతిభ చూపాలని, నైపుణ్యం గల యువతతో సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా శ్రమించడం ద్వారా ఆ రంగంలో రాణిస్తారని తెలిపారు. ఢిల్లీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సహ ఆచార్యులు డాక్టర్ ఎం.లక్ష్మీ నరసింహ, షిల్లాంగ్ నార్త్ ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ ఎస్.అమరేశ్వరరెడ్డి, వైవీయూ ఆచార్యులు శ్రీనివాస్ పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – వరమా.. శాపమా' అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. లలిత, డాక్టర్ పి.సరిత, డాక్టర్ ఎస్.సునీత, రియాజున్నీసా, పార్వతి, డాక్టర్ టి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా.. పందిళ్ల.. సందళ్లు



శ్రీ విజయదుర్గాదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న పందిరి



అమ్మవారిశాల వద్ద జరుగుతున్న పందిరి నిర్మాణ పనులు

కడప కల్చరల్ : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండగ ఘనంగా నిర్వహించుకుంటారు. అందుకే ఈ పండగను విజయదశమి అంటాం. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ పండగలో అమ్మవారికి నవ రాత్రులు నిర్వహించి దశమి రోజున దసరా జరుపుకొంటారు. ఈసారి జిల్లా వ్యాప్తంగా ప్రజలు దసరా పండగను అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. 15 రోజుల ముందు నుంచే మార్కెట్లు కళకళ లాడుతున్నాయి. వారం రోజులుగా అమ్మవారి ఆలయాలన్నీ అలంకరిస్తున్నారు. నగరంలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం(అమ్మవారిశాల)లో ఈ ఏడాది సరికొత్త సెట్టింగులతో వినూత్నంగా అలంకరించేందుకు ఉత్సవ కమిటీ సిద్ధమైంది. దాదాపు అన్ని ఆలయాల వద్ద రాజ భవనాలను తలపించే సెట్టింగులను సిద్ధం చేస్తున్నారు. విజయదుర్గాదేవి ఆలయంలో భారీ పందిళ్లు ఏర్పాటుచేస్తున్నారు. గడ్డిబజారులోని కామకోటి కళాంబదేవి ఆలయం, శ్రీ లక్ష్మీ, సత్యనారాయణస్వామి ఆలయ సముదాయంలో పందిళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆ ప్రక్కనేగల భావనారుషి ఆలయం, ఎదురుగా గల బాల పోలేరమ్మ ఆలయాలు దసరాకు ముస్తాబవుతున్నాయి.

• నీరు నిలిచిందిలా.. నడిచేదెలా..



గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నగరంలోని లోహియా నగర్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. రామరాజుపల్లె, ఎస్ఆర్ నగర్, ఎస్‌బీఐ కాలనీ, బుడగ జంగం కాలనీ, కృపా కాలనీల చుట్టూ వరద నీరు నిలిచింది. అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – కడప కోటిరెడ్డి సర్కిల్

• కిలో అల్లం రూ. 50



కడప నగరంలో ఆటోలో రూ.50కే అల్లం విక్రయించడంతో జనం ఎగబడి కొనుగోలు చేశారు. రైతు బజారులో కిలో రూ.80 పలుకుతోంది. రెండు నెలల కిందట కిలో అల్లం రూ.200 పలికింది. తాజాగా ధర తగ్గుముఖం పట్టింది. కిలో రూ.50కే ఆటోలో విక్రయించడంతో వినియోగదారులు ఎగబడి కొన్నారు. – కడప అగ్రికల్చర్